ఎత్తిపోతలపై తర్జన భర్జన!

- మహానేత వైఎస్సార్ చొరవతో నాడు సాగు
- మరమ్మతులపై అధికారుల అలసత్వం
- నిర్వహణ బాధ్యతలపై అభిప్రాయ సేకరణ
- తీర్మానాల అనంతరం నిర్ణయించనున్న ప్రభుత్వం


రైతులు వదులుకుంటున్న పీబీ దేవం ఎత్తిపోతల పథకం

సామర్లకోట: ఎత్తిపోతల పథకాల కింద సాగవుతున్న భూములకు నీటి సదుపాయం కల్పించిన రైతు బాంధవుడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన తదనంతర కాలంలో వచ్చిన కొందరు పాలకులు వాటిని నిర్లక్ష్యం చేయడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు 60 కిలోమీటర్ల పొడవునా ఉన్న కాలువను సామర్లకోట గోదావరి కాలువగా పిలుస్తారు. ఈ కాలువపై ఐదు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. జి.మేడపాడు ఎత్తిపోతల పథకం పరిధిలో 1,050 ఎకరాలు, వేట్లపాలెం ఎత్తిపోతల పథకం పరిధిలో 1,700 ఎకరాలు, పెద బ్రహ్మదేవం ఎత్తిపోతల పథకం పరిధిలో వెయ్యి ఎకరాలు, ఇళ్లపల్లి ఎత్తిపోతల పథకంలో 750, కాపవరం ఎత్తిపోతల పథకం కింద 600 ఎకరాలు సాగవుతున్నాయి. కొన్ని పథకాలు ఏర్పాటు చేసి 30 ఏళ్లు దాటి పోవడంతో పంపుసెట్లు, పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. దాంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాల నిర్వహణకు వాటి పరిధిలోని రైతుల అభిప్రాయాలు కోరింది. కొన్ని పథకాలను తాము నిర్వహించుకుంటామని, మరికొన్ని పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని ఆయా సభల్లో రైతులు తీర్మానించారు.

ఇటీవల వేట్లపాలెం ఎత్తిపోతల పథకాన్ని రైతులే నిర్వహించు కొంటామని తీర్మానం చేశారు. పురాతన పెద్దబ్రహ్మదేవం పథకాన్ని నిర్వహించలేమని అక్కడి రైతులు చేతులెత్తేశారు. ఇక్కడి పథకాన్ని నిర్వహించాలంటే ప్రభుత్వం ఎకరాకు ప్రతి పంటకు రూ.వెయ్యి నీటి తీరువా చెల్లించాల్సి ఉంటుంది.

వైఎస్సార్ చలవతో పథకాలకు గుర్తింపు

ఎత్తిపోతల పథకాల నిర్వాహణ కష్టంగా ఉన్న తరుణంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ పథకాలకు జీవం పోశారు. 16 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇచ్చేలా చర్యలు తీసుకోవడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. దీనిలో భాగంగా దాళ్వా పంటకు అనుమతి లేకున్నా అధికారులు వంతుల వారీగా సాగునీరు అందజేస్తున్నారు. దాంతో మెట్ట ప్రాంతాల్లో ఉన్న పంట భూములకు నీరు అందే అవకాశం ఏర్పడింది. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులే వాటి నిర్వహణను చేపట్టాల్సి వచ్చింది.


రైతుల నిర్వహణకు ముందుకు వచ్చిన వేట్లపాలెం ఎత్తిపోతల పథకం

ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఆయా పథకాలకు కమిటీలను మార్చడంతో పలు సమస్యలు ఏర్పడుతున్నాయి. ఆయకట్టు పరిధిలోని రైతులు ఎకరానికి కనీసం రూ.300 నుంచి రూ.500 నిర్వాహణ కమిటీకి చెల్లిస్తే తప్ప నిర్వాహణ సక్రమంగా సాగదు.

రైతులకు మేలు



గోదావరి కాలువ అందుబాటులో ఉన్నా సాగునీరు అందని పరిస్థితుల్లో ఎత్తిపోతల పథకాలు రావడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ఉచిత విద్యుత్‌తో నిర్వహణ భారం కొంత తగ్గింది. ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతుల నుంచి నీటితీరువా సక్రమంగా చెల్లించడం లేదు. పురాతన పథకం కావడంతో మరమ్మతులు ఎక్కువగా ఉన్నాయి. దాంతో ప్రభుత్వమే ఈ పథకాన్ని నిర్వహించాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రభుత్వం నిర్వహిస్తే ప్రతి పంటకు రూ.వెయ్యి నీటి తీరువా సరికాదు.

– తోటకూర శ్రీనివాస ప్రకాశరావు, ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు, పీబీ దేవం

రైతులకు సామర్థ్యం ఉంది



రాష్ట్ర వ్యాప్తంగా 650 ఎత్తిపోతల పథకాలు ఉండగా 300 పథకాలు మూలన పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో ఉన్న 20 పథకాలను రైతులే నిర్వహించుకొనే సామర్థ్యం ఉంది. ఆయకట్టు పథకం నుంచి నీరు పొందే ప్రతి రైతు నిర్దేశించిన నీటి తీరువాను రైతు సంఘానికి చెల్లించాలి. అప్పుడే సమర్థవంతంగా నిర్వాహణ సాగుతుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్వహించాల్సి ఉంటుంది.

– పుట్టా సోమన్నచౌదరి, ఉమ్మడి జిల్లా ఎత్తిపోతల సంఘ, గౌరవ అధ్యక్షుడు, మర్రిపూడి

ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడిక


వ్యర్థాలతో మూసుకుపోయిన డ్రెయిన్

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ ఆలయం వద్ద మేజర్ డ్రెయిన్ ప్లాస్టిక్ వ్యర్థాలతో మూసుకుపోయింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు చెత్తా చెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లి దుకాణ దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు డ్రెయిన్ వద్ద నిల్చునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగు పారాల్సిన డ్రెయిన్‌లో పూడిక పెరగడంతో పుర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు డ్రెయిన్ల పూడికతీత పనులు చేపట్టకపోవడంతో పట్టణంలో ఆయా వార్డుల్లో చెత్తా చెదారం పేరుకుపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూడికతీత పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

జనార్దనాచార్యులుకు అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న జనార్దనాచార్యులు

పిఠాపురం: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు విజయ జనార్దనాచార్యులుకు అర్చక సేవా వైభవ రత్న పురస్కారం ప్రదానం చేశారు. హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో సర్ సీవీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యాన 33వ ఉగాది వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం సువర్ణ ఘంటా కంకణం, స్వర్ణ పతకంతో జనార్దనాచార్యులును సత్కరించి, బిరుదు ప్రదానం చేశారు. వేణుగోపాలస్వామి ఆలయం, ఇతర దేవాలయాల అభివృద్ధికి, సమాజ సేవలకు గానూ ఈ పురస్కారం అందజేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మహేంద్రవాడ వెంకటేశ్వరరావు, సినీ నటుడు కోట శంకరరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు.

23న రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు సమీపంలోని ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఈనెల 23వ తేదీ ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ నాయకులు తెలిపారు. వల్లూరి సత్యేంద్రకుమార్ పేరుతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, సీనియర్, జూనియర్ విభాగాలల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. సీనియర్ విభాగంలో ఎడ్లు కిలోమీటరున్నర, జూనియర్ విభాగంలో ఎడ్లు కిలోమీటరు దూరం వెళ్లి రావలసి ఉంటుందని చెప్పారు. తక్కువ సమయంలో వచ్చిన ఎడ్లను విజేతలుగా నిర్ణయిస్తామని తెలిపారు. సీనియర్, జూనియర్ విభాగాలల్లో విడి విడిగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. ఈ పోటీలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

దివిలిలో ట్రాఫిక్ సమస్యకు చెక్


దివిలి జంక్షన్ బ్రిడ్జిపై చేపల వ్యాపారులను తరలిస్తున్న ఎస్ఐ మౌనిక

పెద్దాపురం: నిత్యం రద్దీగా ఉండే మండలంలోని దివిలి జంక్షన్ ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఆదివారం ఎస్ఐ వి.మౌనిక చర్యలు చేపట్టారు. దివిలి–చంద్రమాంపల్లి బ్రిడ్జిపై ప్రతి వారం చేపల విక్రయాలు సాగించడంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. దీంతో స్థానికులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సాక్షి పలు మార్లు ఇచ్చిన కథనంపై ఎస్ఐ స్పందించి ఆదివారం ఉదయం చేపల వ్యాపారులకు వేరే ప్రదేశాన్ని కేటాయించి బ్రిడ్జిపై ఎటువంటి వ్యాపారాలు సాగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణకు ఎస్ఐ తీసుకున్న చొరవ పట్ల స్థానికులు అభినందించారు.

ఆకర్షణీయంగా 'ఐ లవ్ సామర్లకోట'



గడియారం స్తంభం వద్ద సాగుతున్న ఐ లవ్ సామర్లకోట పనులు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో 'ఐ లవ్ సామర్లకోట' బోర్డు పలువురుని ఆకర్షిస్తోంది. పోలీసు రింగ్ సెంటర్‌లో గడియారం స్తంభం ఏర్పాటు చేసి ఆ ప్రదేశంలో ఐ లవ్ సామర్లకోట అనే పేరు చెక్కారు. దీని చుట్టూ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో ప్రతి ఒక్కరూ ఆ బోర్డును తిలకిస్తున్నారు. గడియార స్తంభం పనులలో భాగంగా ఇప్పటికే గడియారం, వాటర్ ఫాల్ ఏర్పాటు చేశారు. గడియారం స్తంభం ఆవరణ లాన్‌లో గడ్డి వేయడంతో పాటు మొక్కలు వేయాల్సి ఉంది. దీనిని ప్రారంభించే సమయంలో మొక్కలు, గడ్డి ఏర్పాటు చేస్తామని కాంట్రాక్టరు తెలిపారు. పనులు పూర్తి కావడంతో ఈ నెలలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు.

అసత్య ఆరోపణలు తగదు

పిఠాపురం: గొల్లప్రోలు మండల పరిధిలోని ఆశా వర్కర్లు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని గొల్లప్రోలు మండలానికి చెందిన కొందరు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అసత్య ఆరోపణ చేస్తున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీఐటీయూ మండల కార్యదర్శి నందీశ్వరుడు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు వడ్డి వెంకటలక్ష్మి, ములగపాటి ఇందిరా పేర్కొన్నారు. ఆదివారం జరిగిన యూనియన్ మండల సమావేశంలో అసత్య ఆరోపణలను ఖండిస్తూ విధి నిర్వహణలో లోపం ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి కానీ ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు దుర్గ, ఉమాదేవి, సత్యవతి, రమణమ్మ, నాగలక్ష్మి, రామ తులసి, తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు ఆదర్శం అమరజీవి


శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్ తదితరులు

పెద్దాపురం: అమరజీవి పొట్టి శ్రీరాముల ప్రాణ త్యాగం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని వక్తలు అన్నారు. శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆయా విగ్రహాల వద్ద, శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో అమరజీవి పోరాటం అందరికీ ఆదర్శమని కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ అన్నారు. స్థానిక సినిమా సెంటర్‌లో అమరజీవి విగ్రహం వద్ద శ్రీరాములు చిత్రపటానికి వారు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.


అమరజీవి విగ్రహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

మఠం సెంటర్‌లో..

సామర్లకోట: పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్థానిక మఠంసెంటర్‌లో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే చినరాజప్ప పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు. నిమ్మకాయల కిరణ్ పాల్గొన్నారు.


మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు

మండల పరిషత్ కార్యాలయంలో..

సామర్లకోట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల పరిషత్ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చేసిన సేవలను ఎంపీపీ గుర్తు చేశారు.

పంచారామ క్షేత్రంలో తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీ పూజలు


తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేష్‌ను సత్కరించిన ఈఓ నీలకంఠం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో తమిళనాడు ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేష్ ఆదివారం పూజలు చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు స్వాగతం పలికారు. కాల భైరవస్వామి, ధ్వజస్తంభం, పెద్దనంది, మూల విరాట్, ఉప ఆలయాలను సందర్శించిన ఆయన స్వామి వారికి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం నంది మండపం వద్ద ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, చీమలకొండ వెంకటరమణ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి ఆశీర్వచనాలు అందజేశారు. ఆయనను ఈఓ నీలకంఠం సత్కరించి స్వామి వారి ఫొటో, ప్రసాదం అందజేశారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రం

సామర్లకోట: పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1035 మంది, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 430 మంది, ప్రైవేటు విద్యార్థులు 872 మంది పరీక్షలు రాయడానికి సిద్ధంగా ఉన్నారని ఎంఈఓ శివరామ కృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని విద్యార్థుల కోసం పట్టణ పరిధిలో ప్రభుత్వ హైస్కూల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలుగా ఉన్నాయి. అలాగే వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో రెండు, ఉండూరు జెడ్పీ హైస్కూల్, నవర జెడ్పీ హైస్కూల్, వీకే రాయపురం జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తూ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ వివరించారు. పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించిన పాఠశాలల్లో మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం వరకు తరగతులు ఉంటాయని, పరీక్షలు లేని సమయంలో ఉదయం పూట తరగతులు ఉంటాయని ఎంఈఓ తెలిపారు.

సాగరతీరంలో సందడి..


పర్యాటకులతో కిటకిటలాడిన ఉప్పాడ సాగరతీరం

కొత్తపల్లి: రోజురోజుకూ ప్రచండభానుడు ఉగ్రరూపం దాల్చడంతో ఎండవేడి భరించలేక జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ క్రమంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఉప్పాడ సాగర తీరానికి వెళ్లి సేద తీరుతున్నారు. తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. మండలం నుంచి వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పర్యాటకుల ఆట పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తుని సమీపంలో తలుపులమ్మతల్లి లోవ అమ్మవారి దర్శించుకుని వెళ్లిన భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు. ఇంటర్ పరీక్షలు పూర్తి కావడంతో తీర ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగింది.

మరిడమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


మరిడమ్మతల్లి ఆలయంలో అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన స్థానిక మరిడమ్మ ఆలయం శనివారం భక్తులు పోటెత్తారు. వారం వారం నిర్వహించే అన్నదానానికి ఈ ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మిల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఘనంగా నూకాలమ్మ పూల గరగ ఉత్సవం


ఉత్సవానికి ఆలయంలో సిద్ధంగా ఉంచిన పూల గరగ


ఆలయం వద్ద సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న కళాకారులు

పెద్దాపురం: మండలం కాండ్రకోట నూకాలమ్మ తల్లి ఆలయ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పూల గరగ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్. సౌజన్య పర్యవేక్షణలో గరగలను గ్రామంలో ఊరేగించారు. భక్తి శ్రద్ధలతో గరగలపై కొత్త చీరలను పాన్పుగా వేసి ఆ చీరను ధరిస్తే శుభకరమని భక్తుల నమ్మకం. దీంతో గ్రామంలో వీధివీధినా, గడపగడపకు అమ్మవారి గరగను ఊరేగించారు. గరగల నృత్యంతో భక్తులు గ్రామంలో వీధివీధినా నాట్యమాడుతూ పూజలు చేశారు. పూల గరగ ఉత్సవంలో గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని, మాజీ ఉప సర్పంచ్ సూర్య చక్రప్రకాష్ తదితరులతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొత్తపల్లి: ఉప్పాడ–కోనపాపపేట బీచ్‌రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడినట్టు పోలీసులు తెలిపారు. మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కందా మణికంఠ అదే గ్రామానికి చెందిన వాసంశెట్టి నాగేశ్వరావు, వాసంశెట్టి శివప్రసాద్‌లు అమీనాబాద్ హార్బర్‌లో జరిగే కార్యక్రమానికి శనివారం రాత్రి రొయ్యలను ఆటోలో తీసుకువెళ్తున్నారు. ఉప్పాడ నుంచి కోనపాపపేట వైపు వెళుతున్న వ్యాన్ వీరి ఆటోను ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈ ముగ్గురికీ గాయాలయ్యాయి. కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ ప్రకాష్ తెలిపారు.

ఫిర్యాదు చేస్తే అవినీతిపై చర్యలు

- పథకాల సమాచారం ప్రజాప్రతినిధులకు తెలియజేయాలి
- ఎంపీపీ బొబ్బరాడ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్తు సమావేశం


విద్యాశాఖ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: ప్రభుత్వ పథకాల సమాచారం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. వీకే రాయపురంలో బయట వ్యక్తులు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న సమాచారం తమకు తెలియదని ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివనాగకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని రూ.రెండు వేలు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై ఫిర్యాదులు ఉంటే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తెలిపారు. పీబీ దేవం గ్రామంలో మహిళా సంఘాల నుంచి రుణాలు ఇప్పించడానికి సంఘం నుంచి రూ. 10 వేలు వసూలు చేస్తున్నారని ఆ గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ ఆరోపించారు. మహిళా సంఘం నుంచి ఫిర్యాదు స్వీకరించి విచారణ చేయాలని ఏపీఎం జగదీశ్వరిని ఎంపీపీ ఆదేశించారు. ఉపాధి సిబ్బంది పని ప్రదేశంలో కాకుండా బయటి పనులు చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీపీ ఆదేశించారు. హౌసింగ్ పథకంలో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు పొజిషన్ పట్టాలు ఇచ్చే ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి ఎంపీపీ సూచించారు. అలాగే కొన్నేళ్లుగా భీమవరం గ్రామంలో ఉన్న 140 ఎకరాల భూమి సమస్య పరిష్కారం కావడం లేదని ఎంపీపీ సత్తిబాబు తహసీల్దార్ దృష్టికి తీసుకు వెళ్లారు. వేట్లపాలెంలో రీ సర్వే పూర్తయిన వెంటనే భీమవరంలో సర్వేలో పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. భీమవరంలో ఒకే సర్వే నెంబరులో 179 ఎకరాల భూమి పరిష్కారం లేకుండా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మారిన మెనూ ప్రకారం ప్రతీ విద్యార్థి భోజనం చేసే విధంగా చూడా లని ఎంఈఓ శివరామకృష్ణకు ఎంపీపీ సూచించారు. 9, 10 తరగతి విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోతున్నారని, వారు కూడా భోజనం చేసేలా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ చెప్పారు. పీబీ దేవం గ్రామంలో త్రివర్ణ పబ్లిక్ స్కూల్‌కు సంబంధించి రెన్యూవల్ చేసే సమయంలో పంచాయతీ అనుమతి ఉండేలా చూడాలని ఎంపీపీ సూచించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మండల ఇంజినీరింగ్ అధికారి సకాలంలో స్పందించడం లేదని, మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశానికి కూడా జేఈ రాక పోవడం తగదని ఎంపీపీ ఆరోపించారు. ఈ సమావేశానికి హాజరైన పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణ మండలంలో పనుల సమస్యలు తన దృష్టికి తీసుకు రావాలన్నారు. రైతులు అందరూ తమ తమ భూములకు సంబంధించిన వివరాలను సచివాలయంలో నమోదు చేయించుకోవాలని ఏఓ ఐ.సత్య సభ్యులకు తెలిపారు. ఈకెవైసీ 96 శాతం పూర్తి అయిన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి, వేట్లపాలెం పీహెచ్‌సీ డాక్టర్ పరదేశీ, మండల పరిషత్ ఏఓ బి.సతీష్ బాబు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధ శతాబ్దపు అల్లరిలో..


పిఠాపురంలో కలుసుకున్న కొత్తగూడేనికి చెందిన పూర్వ విద్యార్థులు

- పిఠాపురంలో కలుసుకున్న కొత్తగూడెం ఐటీఐ పూర్వ విద్యార్థులు
- స్వర్ణోత్సవ వేళ ఆత్మీయ పలకరింపులు

పిఠాపురం: చిన్నప్పుడు ఐటీఐ చదువుకున్న విద్యార్థులు 50 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి రాపర్తి వెళ్లే రహదారిలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ ఫామ్ హౌస్‌లో స్వర్ణోత్సవ ఆత్మీయ కలయిక నూతన శోభ సంతరించుకుంది. ఖమ్మం జిల్లా భద్రాద్రి కొత్తగూడెంలో 1974–76 మధ్య ఐటీఐ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పిఠాపురంలో కలుసుకున్నారు. వారిలో 90 శాతం మంది సింగరేణిలో ఉద్యోగులుగా స్థిరపడగా, వీరితో కలిసి చదువుకున్న పిఠాపురంవాసి కసిరెడ్డి నాగేశ్వరరావు వీరందరినీ తిరిగి కలిపేందుకు మూడు ఏళ్లు కృషి చేసి సఫలీకృతులయ్యారు. పిఠాపురంలో కలుసుకున్న వారంతా నాటి సంగతులు గుర్తు చేసుకుంటూ ఒకరి యోగ క్షేమాలు ఇంకొకరు తెలుసుకున్నారు. నాటి రోజులను తలుచుకుని ఆటపాటల్లో మునిగిపోయారు. రెండు రోజుల పాటు స్వర్ణోత్సవాలు నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. జీవితంలో మళ్లీ ఇలా కలుసుకుంటామని కలలో కూడా అనుకోలేదని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది తమ జీవితాల్లో ఒక మరుపురాని రోజని, ఏటా ఇలా కలుసుకోవాలని నిర్ణయించుకున్నట్లు వారు తెలిపారు. స్నేహితులంతా ఒక గ్రూప్ ఏర్పాటు చేసి ఎవరికి ఏ కష్టం వచ్చినా అందరూ సహకరించేలా నిర్ణయం తీసుకున్నారు.